## అజ్ఞానోదయం

ఇల్లలుకుతూ అలుకుతూ ఈగ తన పేరు మరిచి పోయింది, వెనకటికి ఏదో పాత కథలో - ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకుంటూ, దిద్దుకుంటూ మనిషి, తన ఉనికినే మరిచి పొయ్యాడు.

తనెవరు?

ఎట్లా ఉంటాడు?

ఏం చేస్తాడు?

ఎందుకు చేస్తాడు? - అసలేవీ గుర్తులేవు.

మనిషి, తను మనిషన్న సంగతి మరిచిపోయి చాలా కాలమైంది. తనను తాను అన్వేషించుకోవడం ప్రారంభించాడు. రాత్రింబవళ్ళు కళ్ళు మూసుకుని ధ్యాన ముద్రలో గడిపాడు.

గడ్డం పెరిగింది. కాని, జ్ఞానోదయం కాలేదు.

తానెవరో తెలుసుకోవడానికి మనిషి దేశం మీద పడ్డాడు. కనబడ్డ వారినల్లా అడగడం మొదలు పెట్టాడు. రోడ్డు పక్కన జరిగే ఎలక్షను మీటింగ్ దగ్గర ఆగాడు.

"అయ్యా! తమరు దేశ నాయకుడిలా ఉన్నారు. కాస్త నేనెవరో గుర్తించి చెబుతారా?" - అన్నాడు మనిషి. నాయకుడు చిద్విలాసంగా నవ్వి - "నువ్వెవరైతే నీకెందుకు? నువ్వు నా ఓటువి. జేబులో నలిగిన నోటువి" - అన్నాడు కూలింగ్ గ్లాసుల్లోంచి నీలి నీలిగా.

రైల్వే ప్లాట్‌ఫారం మీద గూడ్సు బండికి పంచె ఆరదీస్తున్న సన్యాసి కనిపించాడు. "ఆర్యా! శరణు శరణు. నేనెవరో ఏమిటో

తెలుసుకోలేకున్నాను. అజ్ఞానిని. కరుణించు స్వామి" - అన్నాడు మనిషి. సన్యాసి ఖంగుతిన్నాడు. వెంటనే సంభాళించుకుని "ఓయీ నీవు హిమాలయాలకు రమ్ము. అక్కడ నీకు జ్ఞాన మార్గము బోధించెదను. అప్పుడు గాని నీకు నువ్వెవరో తెలియదు" - అన్నాడు. మనిషి జేబులు చూచుకున్నాడు. దాదాపు ఖాళీగా ఉన్నాయి. "చాయ్‌కే పైసల్లేవ్. ఈ లెక్కన హిమాలయాలదాకా ఏంపోతాం?" - అనుకున్నాడు ఉస్సూరుమంటూ. అటూ ఇటూ చూసేంతలో చిత్రం జరిగిపోయింది. సన్యాసిగారు బొల్లారం లోకల్ ట్రెయిన్ రన్నింగ్‌లో ఎక్కేసి చక్కా పొయ్యారు. "ఏం మహిమ? ఎంత మనోనిబ్బరం"- అనుకున్నాడు మనిషి తనలో తాను.

ఓడిపోయి విదేశాల నుండి తిరిగొచ్చిన క్రికెట్ ఆటగాణ్ణి అంతా చుట్టుముడుతున్నారు. 'అంత ముఖ్యమైన వాడయితే అతనికి తన సంగతి కొంచెమైనా తెలియక పోతుందా' - అని మనిషి గుంపులో జొరపడి అమాయకంగా ఆడిగాడు. "సార్. సార్. నేనెవరో ఏమిటో కాస్త గుర్తు పట్టి చెబుతారా?"

వ్యాపార ప్రకటనలో నవ్వినట్టుగా నవ్వి, ఉత్పత్తి దారుడు, కొనుగోలు దారుని చూసినట్టుగా చూసి - ''నువ్వెవరో నీకు తెలియదా? స్టేడియంలో, టి. వి. ప్రత్యక్ష ప్రసారాల్లో నన్ను చూస్తూ.... నువ్వు నా అభిమానివన్న సంగతి మరిచే పొయ్యావా?" - అని ఆటగాడు తన మెళ్ళోని దండ తీసి మనిషి మెడలోకి విసిరాడు, ''దండ బాగానే ఉంది. అమ్ముకుంటే పది రూపాయలైనా రాకపోవు" - అనుకున్నాడు మనిషి. లోలోపల కొంత సంతోషించాడు. ఇంతకు ఇంతే చాలు - అని అనుకుని పక్కకు చూశాడు. ఆటగాడి పక్కనే అతనికి కాబోయే భార్య ఉంది. ఆమె పెద్ద సినిమా తార. ఆమె అతనికన్నా నాలుగాకులు ఎక్కువ చదివినదానిలా అనిపించింది. మనిషికి ఆమె మీద నమ్మకం కుదరలేదు. క్రికెట్ ఆటగాడిలాగానే ''మీరు నా విలువైన

ప్రేక్షకుడుగారు కదా!" - అని గొప్పగా నటించొచ్చు. ఎందుకు లే లేనిపోని గొడవ. మరెవరి దగ్గరికైనా పోతే మంచిది అని అక్కడి నుండి చల్లగా జారుకున్నాడు మనిషి.

దారిలో బార్‌లోకి, బ్యాంక్‌లోకి, షాప్‌లోకి తొంగి చూశాడు. దేనిలోకి చూసినా "కస్టమర్ గారూ రండి. రండి. స్వాగతం! అనే పిలుపులు వినిపించాయి. ఎవడిగొడవవాడిదే తప్ప, తన గొడవ వినే నాథుడే లేడే - అని మనిషి తీవ్రంగా బాధ పడ్డాడు.

స్టాక్ ఎక్స్చేంజ్ దగ్గర చెదలు పుట్టలా జనం కనిపించారు. వాళ్ళంతా దేనికోసం ఎగబడుతున్నారో మనిషికి అంతు పట్టలేదు. అంత మందిలో తనను గుర్తు పట్టి చెప్పేవాడు ఒక్కడంటే ఒక్కడు ఉండక పోతాడా - అని మనిషి గుంపులో చేరాడు. తొక్కిసలాటలో మనిషి కింద పడ్డాడు. అతని పై నుండి షేర్సూ, డిబెంచర్సూ, బ్రోకర్సూ, ప్రైమరి - సెకండరీ ఇన్వెస్టిమెంట్సూ.... అన్నీ కదలి పోయ్యాయి. మనిషి లేచి పిచ్చివాడిలా తల పీక్కుని, రోడ్డుకు అడ్డం పడి నడవడం మొదలు పెట్టాడు.

పెద్దగా కారు హారన్ మోత వినబడి, కుప్పగూలి పొయ్యాడు. మనిషికి మెలకువ వచ్చే సరికి ఆటోమేటిక్ కారు వెనక సీట్లో పడు కుని ఉన్నాడు. శాస్త్రవేత్త మనిషిని నిశితంగా పరిశీలిస్తున్నాడు.

"ఎవరయ్యా నువ్వు? నా కారు కింద పడతావ్? బుర్రుందా అసలు? నీకోసం, నీ బాగుకోసం, కాదూ నేను జీవితాంతం త్యాగం చేస్తున్నది? ఎంత పరిశోధన చేశాను? నీజాతి అంతరించి పోతుందేమో నని టెస్ట్ ట్యూబ్‌లలో కూడా నీ సంగతిని పెంచే ప్రయత్నం చేస్తు న్నాను. నీకు ఎయిడ్స్ వస్తే మందు కనుక్కుంటున్నాను. నువ్వేమో నీ విలువ నువ్వు తెలుసుకోవు. ఈ ప్రకృతిలో నీ గొప్పతనం మరే జీవికుందో చెప్పు?.... ఇంత పెద్ద శాస్త్రవేత్తను, ఒక్కోసారి నాకే

అంతుపట్టవు .... అదిసరే - ఎవరయ్యా నువ్వు?" అని అడిగాడు సైంటిస్టు. పెద్ద లెక్చరు తర్వాత ఈ లోకంలోకి వచ్చి.

తన గురించి అన్నీ తెలుసు నంటున్నాడు. మళ్ళీ ఏమీ తెలియని వాడిలా ఎవరని అడుగుతున్నాడు. ఏం సమాధానం చెప్పేది? - అని మనిషి లోలోన పిసుక్కున్నాడు.

''అన్నీ తెలిసిన వారు మీరే చెప్పాలి సార్. నేనెవరో ఏమిటో తెలియక, తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాను.''

''ఆ - దట్స్ - వండర్‌ఫుల్!'' - అని పెద్దగా నవ్వాడు సైంటిస్ట్. నువ్వా? నువ్వింత ప్రొటోప్లాజమ్‌వు. అంతే. లోతుకు వెళ్ళి చెప్పాలంటే 'డి.యన్.ఎ - ఆర్.ఎన్.ఎ.వు.' బి - పాజిటివ్ బ్లడ్ గ్రూప్‌వి!! అర్థమైందా? మైడియర్ హోమో సేపియన్! యూ ఆర్ ఎ సివిలైజ్‌డ్ ఆనిమల్ ఆన్ ద ఎర్త్ - అంతే''.

మనిషికి అంతా గోడ పెట్టినట్టుగా ఉంది. ఏమీ అర్థం కాలేదు. త్వరగా బయటపడితే మంచిది. ఏం చెయ్యాలో తోచక రకీమని చిటికెన వేలు చూయించాడు. సైంటిస్ట్ కారు ఆపలేదు. "అదిగో ఆ టాయిలెట్ కార్నర్ వాడుకో" -

"అబ్బె - అలా కాదు.... దిగిపోతాను. నన్నొదిలేయండి. ప్లీజ్".

"అంటే ఇక్కడి నుండి నీ ప్లేస్‌కు వెళ్ళి పోగలనంటావా? ష్యూర్? - మళ్ళీ దారి తప్పవు కదా?"

"అవును సార్ దింపేయండి" - కారు ఆగడంతోటే మనిషి హడావుడిగా రోడ్డునపడి పరుగు లంకించు కున్నాడు. 'తను దారిలో ఉన్నది ఎప్పుడని? ఇప్పుడు కొత్తగా తప్పడానికి!?' - ....

తనకన్నా వేగంగా పరుగెత్తుతున్న జంతువేమై ఉంటుందా? అని మైదానంలో గడ్డిమేస్తున్న గుర్రం వెనక్కి తిరిగి చూసింది. "ఇ

హి హి హీ" అని పెద్దగా సకిలించింది. మనిషి టక్కున ఆగి పొయ్యాడు. ఒకానొకప్పటి కథలో ఈ సకిలింపు వినేకదా ఈగకు తాను ఈగననే విషయం గుర్తుకొచ్చింది. తనెవరో తనకు గుర్తు రావడం ఎలా? తను ఈగ కాదు కదా? ఎందుకైనా మంచిది గుర్రాన్ని అడుగుదా మనుకున్నాడు. కాని, "నా పరుగు మీద డబ్బులు కాసే వాడివి. బతుకు కొల్లగొట్టుకునే వాడిని. నువ్వూ, నీ బతుకూ నా కాళ్ళ మీద ఆధార పడాల్సిందే" - అని గుర్రం ఎక్కడ ఆట పట్టి స్తుందోనని ఒక్క క్షణం ఆగాడు మనిషి. గుర్రం హేళనగా సకిలించింది.

మనిషికి పిచ్చి కోపం వచ్చింది. బడితె తీసుకుని గుర్రాన్ని బాదడం మొదలు పెట్టాడు. కాళ్ళ మీద, కీళ్ళ మీదా వాయించాడు. "అదెనా కంచర గాడిదలకూ్కడా లోకువై పోతే ఇంకెందుకూ బతికీ"- అనుకున్నాడు. కాసేపటికి పైకే అన్నాడు. గుర్రం వెంటపడి మళ్ళీ బాదాడు.

"బాబూ - పశుత్వం కాదు. మానవత్వం" - అని కేకలు వినిపించాయి.

సిగరెట్ పీలుస్తూ, చేతికర్ర ఊపుకుంటూ, శాలువా కప్పు కున్న పెద్దాయన కనిపించాడు.

"నువ్వు మానవుడివి కదా. మానవత్వం ఉండాల్సిన వాడివి కదా! ఆ నోరులేని జంతువు మీద నీకెందుకు కోపం?" - ఆయన మాటలు వింటుంటే తను మానవుడి ననే అనుమానం కలిగింది మనిషికి.

"ఈ గుర్రం మీదేనా?" - అడిగాడు మనిషి ఏమనాలో తెలియక.

"అవును బాబూ. మా ముత్తాతల తాతలకు శ్రీకృష్ణదేవ రాయలు ఓ గుర్రాన్నిచ్చారు. దాని సంతతే ఇది. అశ్వం - ఆశు

కవిత్వం మా వారసత్వం. పాత వైభవానికి చిహ్నం. ఒక జ్ఞాపకం. తర తరాల వారధి. నా లేమి తనానికి సారధి. నా ఈ కాళ్ళనొప్పుల వృద్ధాప్యానికి ఔషధం'' - అని అనగానే గుర్రం దగ్గరగా వచ్చి తల వంచుకు నిలబడింది. కవి ప్రేమగా గుర్రాన్ని నిమిరాడు.

''మన్నించండి. కవిగారూ, మీ గుర్రాన్ని దండించాను. బహుశా నామీది కోపం కూడా గుర్రం మీదే చూపించాను. నేనెవరో నేను తెలుసుకునే ప్రయత్నంలో పిచ్చివాణ్ణయి తిరుగుతున్నాను. ఎవరికి వారు, వారి వారి కోణంలో నన్ను నిర్వచించారే గాని, నువ్వు నువ్వురా! మనిషివిరా అని చెప్పిన పాపాన పోలేదు. తమరు కరుణించారు. నేను మనిషి నన్న విషయం బోధపరిచారు'' - అన్నాడు మనిషి వినయంగా.

''మనిషిని మనిషిగా గుర్తించడమే. మనిషిని మనిషిగా కీర్తించడమే కవిగా నేను చేస్తున్న పని నాయనా. నిన్ను నువ్వు తెలుసుకుంటే ఈ విశాల విశ్వంలో నిన్ను మించిన శక్తి లేదు. నీకు ఆత్మస్థైర్యం కలుగుగాక! .... ఏదీ ఒక్కసారి 'మానవత్వం నిలుపుకుంటా తోటి మనిషిని కలుపుకుంటా' - అని గొంతెత్తి చాటు బాబూ'' - అని అన్నాడు కవి ఆశగా. తన కలలు ఫలించిన క్షణాలు ఆసన్నమైనా యన్న సంతోషంలో -

మనిషి తొందరపడ్డాడు - ''మానవత్వం మంటగలిపెద. తోటి మనిషి తాట ఒలిచెద!'' అని అరిచాడు.

కవి బాధతో కళ్ళు మూసుకున్నాడు - తప్పిపోయిన మనిషి తాలూకు దీన ఆర్తనాదం ఎక్కడినుండో సన్నగా వినిపిస్తూనే ఉంది.

○

సెప్టెంబర్ 1992